# స్థానిక ఎన్నికల తరువాతే యువ వికాసం!

## అనర్హులను ఎంపిక చేస్తున్నారనే ఆరోపణలు

- ముందుకెళ్తే నష్టమని సర్కారు యోచన
- పంచాయతీ పోరు తర్వాతే ఇవ్వాలని నిర్ణయం
- అదీ గ్రామసభల్లోనే ఎంపిక..
- సిబిల్ స్కోర్‌కే బ్యాంకర్ల ప్రాధాన్యం
- తలలు పట్టుకుంటున్న అధికార యంత్రాంగం



హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): దరఖాస్తులు కొండంత.. యూనిట్లు గోరంత.. అందులోనూ కాంగ్రెస్ కార్యకర్తలకే ప్రాధాన్యం! వెరసి యువత నుంచి తీవ్ర వ్యతిరేకత.. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికల ముందు ఎందుకీ గొడవ? అనుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ యువవికాసం పథకాన్ని తాత్కాలికంగా పక్కనబెట్టింది. లబ్ధిదారుల ఎంపికను ఎక్కడికక్కడ నిలిపేసింది. స్థానిక సంస్థల ఎన్నికల తరువాత, లబ్ధిదారులను గ్రామసభల్లోనే ఎంపిక చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. రాజీవ్ యువవికాసం పథకం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాలకు చెందిన 16,27,584 మంది దరఖాస్తు చేసుకోగా, ప్రభుత్వం 4,93,234 యూనిట్లను మంజూరు చేసింది. తొలిదశలో రూ.50 వేల లోపు యూనిట్లతో మొదలుపెట్టి చివరగా రూ.4 లక్షల యూనిట్లను అందివ్వాలని భావించింది. వాస్తవానికి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, బ్యాంకులు సిబిల్‌స్కోర్‌కే ప్రాధాన్యం ఇవ్వడం, స్థానిక నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలకే ఇవ్వాలని పట్టుబట్టడంతో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిలిచిపోయింది.

### యువత వ్యతిరేకతతో వెనుకడుగు

రాజీవ్ యువ వికాసం పథకం కింద యువతకు రుణాలను అందిస్తామని చెప్పిన ప్రభుత్వం.. గరిష్ఠంగా 60 ఏండ్ల వయసు వారికీ అవకాశం కల్పించింది. దీనిని యువత తీవ్రంగా వ్యతిరేకించింది. మరోవైపు, ప్రభుత్వం లబ్ధిదారుల ఎంపికకు అనేక షరతులు పెట్టింది. దీనికితోడు ఎమ్మెల్యేలు చెప్పిన వారినే ఎంపిక చేస్తున్నారని, పైరవీలకు, కాంగ్రెస్ కార్యకర్తలకే పెద్దపీట వేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో పూర్తి పారదర్శకంగా ఎంపిక చేసేందుకే ఈ పథకాన్ని వాయిదా వేస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం పరిస్థితి తీవ్రతను సూచిస్తున్నది. రాజీవ్ యువ వికాసం కోసం 16,27,584 మంది దరఖాస్తు చేసుకోగా, అందులో 50 శాతానికిపైగా రూ.4లక్షల యూనిట్లకు సంబంధించినవే ఉన్నాయి. దళితబంధు, బీసీబంధు, ట్రైకార్ రుణాలకు గతంలోనే దరఖాస్తు చేసుకుని ఎదురుచూస్తున్నవారు మరో 10 లక్షల మందికిపైగా ఉంటారు. వారందరికీ రుణాలు ఇవ్వలేని పరిస్థితి. ఒకరికి ఇస్తే పది మంది తిరగబడతారనే భయం సర్కారుకూ పట్టుకున్నది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించిన తరువాతనే దీనిపై ముందుకుపోవాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చినట్టు ఉన్నతాధికారులు, పార్టీ వర్గాలూ వెల్లడిస్తున్నాయి.

### గ్రామసభల్లో సరే.. ఎంపిక ఎలా?

యువత నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపికను గ్రామసభల్లో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలుస్తున్నది. అయితే గ్రామసభల్లో ఎంపిక ప్రక్రియను ఎలాచేయాలో అర్థం కాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఎందుకంటే, ఈ పథకం కింద రూ.50 వేల యూనిట్ మినహా మిగిలిన యూనిట్లన్నీ బ్యాంకు లింకేజీ రుణాలే. ప్రభుత్వ సబ్సిడీపోగా మిగతా మొత్తాన్ని బ్యాంకులే రుణంగా మంజూరు చేయాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో దరఖాస్తుదారుల సిబిల్‌స్కోర్‌ను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు ఉన్న వారినే బ్యాంకులు ఎంపికచేస్తున్నాయి. కానీ, స్థానిక కాంగ్రెస్ నేతలు తాము చెప్పిన వారికే ఇవ్వాలని పట్టుబడుతున్నారు. దీంతో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ముందుకు సాగని పరిస్థితి నెలకొన్నది. గ్రామసభల్లో ఎంపిక అంటే రాజకీయ జోక్యం మరీ ఎక్కువవుతుందని, అది ఇంకా కష్టమని అధికారులు తలలు పట్టుకుంటున్నారు.



విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి పబిత్రా మార్గరీటా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ అధికారి స్నేహజ

## హైదరాబాద్ పాస్‌పోర్ట్ కార్యాలయానికి పురస్కారం

హైదరాబాద్, జూన్ 24(నమస్తే తెలంగాణ): 2024-25 సంవత్సరానికిగాను 'వినూత్న సంస్కరణలు, పౌర-కేంద్రీకృత కార్యక్రమాలు' అనే క్యాటగిరీ కింద హైదరాబాద్ పాస్‌పోర్ట్ కార్యాలయానికి పురస్కారం లభించింది. ఢిల్లీలో నిర్వహిస్తున్న 13వ పాస్‌పోర్ట్ సేవాదివస్‌లో భాగంగా మంగళవారం విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి పబిత్రా మార్గరీటా హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ అధికారి జొన్నలగడ్డ స్నేహజకు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఆపరేషనల్ ఎఫిషియెన్సీని కొనసాగిస్తూ దరఖాస్తుల పెండెన్సీని తగ్గించడం, అపాయింట్‌మెంట్ సమయాన్ని మెరుగుపర్చడం, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేలా చూడడం, ఈ-పాస్‌పోర్ట్ విధానాన్ని అమలు చేయడం తదితర సంస్కరణలను విజయవంతంగా అమలుచేస్తున్నందుకు ఈ గుర్తింపు లభించింది. అలాగే, దరఖాస్తులు త్వరితగతిన పరిశీలించి పాస్‌పోర్టులను వేగంగా అందించడంలో నిరంతరం రాణిస్తున్న రాష్ట్ర పోలీసులను ఈ సందర్భంగా సన్మానించారు. ఇంటెలిజెన్స్ డైరెక్టర్ జనరల్ బత్తుల శివధర్‌రెడ్డి అవార్డు అందుకున్నారు.

## అమెరికాతీరుతో ప్రపంచంలో అశాంతి

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

హైదరాబాద్, హిమాయత్‌నగర్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): అమెరికా తీరుతో ప్రపంచంలో అశాంతి పరిస్థితులు నెలకొన్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆందోళన వ్యక్తంచేశారు. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధంలో అమెరికా ప్రత్యక్షంగా ఇరాన్‌పై దాడికి తెగబడడం గర్హనీయమని మండిపడ్డారు. ఇరాన్‌పై అమెరికా దాడిని నిరసిస్తూ.. మంగళవారం పది వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నారాయణగూడ వైఎంసీఏ కూడలి వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సామ్రాజ్యవాద కాంక్షతో ప్రపంచ దేశాలను మూడో ప్రపంచ యుద్ధం వైపు నడిపించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీఎస్ బోస్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి, రాష్ట్రకార్యవర్గ సభ్యుడు గోవర్దన్ తదితరులు పాల్గొన్నారు.

## 'సిట్' విచారణకు ఎంపీ ఈటల హాజరు

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): ఫోన్‌ట్యాపింగ్ కేసులో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ మంగళవారం సిట్ అధికారుల విచారణకు హాజరై, వాంగ్మూలం ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన వ్యక్తి స్వేచ్ఛను హరించే అధికారం ఎవరికీ లేదని అన్నారు. కేసును వెంటనే సీబీఐకి అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు.

## వైఎస్ జగన్‌పై మరో కేసు

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌పై మరో కేసు నమోదైంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా.. ఫిబ్రవరి 19న గుంటూరు మిర్చి యార్డులో రాజకీయ ప్రసంగాలు చేయడంపై పోలీసులు ఆయనపై కేసు ఫైల్ చేశారు. ఈ మేరకు మంగళవారం గుంటూరు జిల్లా నల్లపాడు పోలీసులు వైసీపీ నాయకులకు నోటీసులు అందజేశారు. జగన్‌తో పాటు వైసీపీ నేత అంబటి రాంబాబు సహా పలువురికి నోటీసులు ఇచ్చారు. తాము పిలిచినప్పుడు విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఇటీవల రెంటపాళ్ల పర్యటన సందర్భంగా రైతు సింగయ్య జగన్ కారు కింద పడి మృతి చెందాడనే కారణంతో ఆయనపై కేసు నమోదైన విషయం తెలిసిందే. కాగా, మృతికి కారణమైన జగన్ బుల్లెట్‌ప్రూఫ్ కారును మంగళవారం పోలీసులు సీజ్ చేశారు.

## మళ్లీ తెలంగాణకు ఆమ్రపాలి

### క్యాట్‌లో ఊరట



హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): ఐఏఎస్ అధికారిణి కాటా ఆమ్రపాలికి సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్)లో ఊరట లభించింది. ఆమెను తిరిగి తెలంగాణకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. గతంలో తెలంగాణలో పనిచేసిన ఆమ్రపాలి డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం (డీవోపీటీ) ఉత్తర్వుల మేరకు ఇక్కడ రిలీవై ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లారు. డీవోపీటీ ఆదేశాలను సవాల్ చేస్తూ తనను తెలంగాణకే కేటాయించాలని ఆమె క్యాట్‌లో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌ను అనుమతించిన క్యాట్ ఆమెను తెలంగాణకు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

## 'భూ హక్కులు సివిల్ కోర్టులోనే తేల్చుకోవాలి'

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): భూములకు సంబంధించిన యాజమాన్య హక్కులు, ఆ హక్కులకు చెందిన పత్రాల ప్రామాణికత, హక్కులు ఎవరివో సివిల్ కోర్టులు మాత్రమే తేల్చుతాయని హైకోర్టు స్పష్టంచేసింది. ఈ మేరకు జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ఇటీవల తీర్పు చెప్పారు. భూములపై యాజమాన్య హక్కులు, భూమి ఎవరి ఆధీనంలో ఉన్నది, యజమాని, వారసులు ఎవరో వంటి అంశాలను సివిల్‌సూట్ ద్వారా సివిల్ కోర్టులోనే తేల్చుకోవాలని స్పష్టంచేశారు. హైదరాబాద్‌లోని షేక్‌పేట గ్రామం బంజారాహిల్స్‌లోని సర్వే నంబర్ 396లో 7 ఎకరాలకు తాము దైవాన్ మహారాజా కిషన్ పెర్షద్ వారసులమని కొందరు హైకోర్టును ఆశ్రయించారు. భూయజమానుల పూర్వీకులతో రియల్‌ఎస్టేట్ సంస్థ ప్రెస్టేజ్ ఎస్టేట్స్ చేసుకున్న పవర్ ఆఫ్ అటార్నీని రద్దు చేయాలని పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారించిన హైకోర్టు.. భూయాజమాన్య హక్కుల వ్యవహారంతో ముడిపడిన వీటిని సివిల్‌కోర్టులోనే తేల్చుకోవాలని తీర్పు చెప్పింది.

# విద్యుత్తు సంస్థలకు కొత్త డైరెక్టర్లు

### నాలుగు సంస్థలకు నియామకం

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ) : విద్యుత్తు సంస్థల్లోని డైరెక్టర్ పోస్టులను సర్కారు ఎట్టకేలకు భర్తీచేసింది. ఇన్‌చార్జి డైరెక్టర్ల స్థానంలో నాలుగు విద్యుత్తు సంస్థలకు రెగ్యులర్ డైరెక్టర్లను నియమించింది. ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్ మంగళవారం నాలుగు వేర్వేరు జీవోలను జారీ చేశారు. ఉత్తర, దక్షిణ విద్యుత్తు పంపిణీ సంస్థలతోపాటు రాష్ట్ర విద్యుత్తు సరఫరా సంస్థ(టీజీ ట్రాన్స్‌కో), విద్యుత్తు ఉత్పత్తి సంస్థ(టీజీ జెన్ కో)లో కూడా కొత్త డైరెక్టర్లను నియమించింది. టీజీ జెన్‌కో కోల్ అండ్ లాజిస్టిక్స్ డైరెక్టర్‌గా రైల్వే, సింగరేణి సంస్థల్లో పనిచేసిన బి నగ్యాను నియమించారు. అయితే ఆయన తెలంగాణలో పనిచేసేందుకు ఆసక్తిచూపడంతో సర్కారు ఆయనకు అవకాశం కల్పించినట్టు ప్రచారం జరుగుతున్నది. ఇప్పటికే ఇన్‌చార్జి డైరెక్టర్లల్లో ఒకరికి అవకాశం దక్కింది. మిగతా వారిని పక్కనపెట్టింది. విద్యుత్తు సంస్థలవారీగా కొత్త డైరెక్టర్ల వివరాలిలా ఉన్నాయి.

**ఉత్తర తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ (టీజీఎన్‌పీడీసీఎల్)**

| డైరెక్టర్ పేరు | విభాగం |
|---|---|
| వంటేరు తిరుపతిరెడ్డి | ఫైనాన్స్ |
| టీ మధుసూదన్ | ఆపరేషన్స్ |
| వంగూరు మోహన్‌రావు | ప్రాజెక్ట్స్ |
| సీ ప్రభాకర్‌రావు | హెచ్‌ఆర్‌డీఅండ్‌ఐఆర్ |

**దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ (టీజీ ఎస్పీడీసీఎల్)**

| డైరెక్టర్ పేరు | విభాగం |
|---|---|
| వీ శివాజీ | ప్రాజెక్ట్స్ |
| ఎన్ నర్సింహులు | ఆపరేషన్స్ |
| చిలుకమారి చక్రపాణి | కమర్షియల్ |
| పీ కృష్ణారెడ్డి | ఫైనాన్స్ |

**తెలంగాణ విద్యుత్తు సరఫరా సంస్థ (ట్రాన్స్‌కో)**

| డైరెక్టర్ పేరు | విభాగం |
|---|---|
| గాదె సంపత్ | గ్రిడ్‌అండ్‌ట్రాన్స్‌మిషన్ |
| డీ లతావినోద్ | ప్రాజెక్ట్స్ |
| ఓరుగంటి శ్రీనివాసులు | ఫైనాన్స్ |

**తెలంగాణ విద్యుత్తు ఉత్పత్తి సంస్థ (జెన్‌కో)**

| డైరెక్టర్ పేరు | విభాగం |
|---|---|
| పీ బాలరాజు | హైడల్ |
| వై రాజశేఖర్‌రెడ్డి | థర్మల్ విద్యుత్తు, ప్రాజెక్ట్స్ |
| ఎస్ వీ కుమార్ రాజు | హెచ్‌ఆర్ అండ్ ఐఆర్ |
| బీ నాగ్యా | కోల్ అండ్ లాజిస్టిక్స్ |
| జీ వీర మహేందర్ | ఫైనాన్స్, కమర్షియల్ |

# అర్థగణాంక శాఖకు కొత్త జవసత్వాలు

- 166 పోస్టులకు క్యాబినెట్ ఆమోదం
- 1-2 నెలల్లో జీవో జారీకి అవకాశం

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర అర్థగణాంక శాఖ (డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్) కొత్త జవసత్వాలను సమకూర్చుకోనున్నది. ఈ శాఖలో 166 కొత్త పోస్టులు సృష్టించేందుకు రాష్ట్ర క్యాబినెట్ తాజాగా ఆమోదం తెలిపింది. క్యాబినెట్ నిర్ణయం రాష్ట్ర ఆర్థిక, సామాజిక డాటా సేకరణ, విశ్లేషణ సామర్థ్యాన్ని మరింత పటిష్ఠం చేస్తుందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ కొత్త పోస్టుల ద్వారా అర్థగణాంక శాఖలో మానవ వనరుల లోటును తీర్చడంతోపాటు డాటా నాణ్యత, విశ్వసనీయత మరింత పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. వీటిలో 36 పోస్టులను అప్‌గ్రేడ్, ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి. ఈ పోస్టుల నియామకాలకు సంబంధించిన జీవో ఒకటి నుంచి రెండు నెలల్లో రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. జీవో జారీ అయిన తర్వాత నియామక ప్రక్రియ నోటిఫికేషన్ విడుదల కానున్నది. టీజీపీఎస్సీ ద్వారా వివిధ ప్రక్రియల్లో అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు.

**అర్థగణాంక శాఖకు సంబంధించి క్యాబినెట్ ఆమోదం తెలిపిన పోస్టులు**

| పోస్టు పేరు | సంఖ్య |
|---|---|
| డిప్యూటీ డైరెక్టర్ | 12 |
| అసిస్టెంట్ డైరెక్టర్ | 12 |
| స్టాటిస్టికల్ ఆఫీసర్ | 46 |
| డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ | 64 |
| సూపరింటెండెంట్ | 5 |
| సీనియర్ అసిస్టెంట్ | 4 |
| జూనియర్ అసిస్టెంట్ | 23 |
| మొత్తం | 166 |

## 'సంధ్య' శ్రీధర్‌రావుపై మరో కేసు నమోదు

శేరిలింగంపల్లి, జూన్ 24: సంధ్య కన్వెన్షన్ ఎండీ సరనాల శ్రీధర్‌రావుపై మరో కేసు నమోదైంది. రెహమత్‌నగర్‌కు చెందిన నర్సింహారెడ్డికి శ్రీధర్‌రావు ఫోన్ చేసి చంపేస్తానని బెదిరించిన ఓ ఆడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారగా, బాధితుడు గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కొద్దిరోజుల క్రితం గచ్చిబౌలిలోని ఫెర్టిలైజర్స్ కోఆప్టివ్ హౌసింగ్ సొసైటీలో హైడ్రా అధికారులు సర్వే చేస్తుండగా దాడి చేశారని నటి రమ్యశ్రీ సోదరుడు ప్రశాంత్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, శ్రీధర్‌రావుతోపాటు మరి కొందరిపై కేసు నమోదైంది.

# ఉత్తరానికి ఉత్తచెయ్యి!

మొదటిపేజీ తరువాయి...

ఉన్నారు. ఇలా ట్రిపుల్ ఆర్ వ్యవహారమంతా గందరగోళంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరితో అయోమయం నెలకొన్నది. సంగారెడ్డి జిల్లా పరిధిలో గిర్మాపూర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా తంగడపల్లి వరకు 161.518 కిలోమీటర్ల వరకు ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం రహదారిని నిర్మించాలని నిర్ణయించారు. దీనికోసం నిరుడు డిసెంబర్ నుంచి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ఆధ్వర్యంలో టెండర్ల ప్రక్రియ కొనసాగుతున్నది. దీనికి కేంద్రం నుంచి రావాల్సిన కొన్ని అనుమతులు రాలేదు. ఈ మధ్యలో నాలుగు లేన్ల రహదారిని ఆరు లేన్లుగా మార్చారు. దీంతో టెండర్ల ప్రక్రియ కొలిక్కి రావడంలేదని అధికారవర్గాలు చెప్తున్నాయి. ఉత్తరభాగం రహదారి నిర్మాణానికి దాదాపు 1,950 హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉండగా, ఇందులో 95 శాతం వరకు భూసేకరణ పూర్తయినట్టు ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది. రైతులకు రూ.5,100 కోట్లను నష్టపరిహారంగా చెల్లించాల్సి ఉంటుందని అంచనాలు రూపొందించగా, అందులో సగం, అంటే రూ.2,550 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉన్నది. మరోవైపు, అవార్డ్ పాస్ చేసిన భూముల రైతులు తమకు ఇవ్వజూపిన నష్టపరిహారం సరిపోదని పేర్కొంటూ కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో ట్రిపుల్ ఆర్ నిర్మిస్తున్న జిల్లాల్లో ప్రభుత్వం భూముల ధరలను పెంచడంతోపాటు ట్రిపుల్ ఆర్ భూసేకరణలో సమస్యల పరిష్కారానికి ఆర్బిట్రేషన్‌ను ఏర్పాటుచేసింది.

### నిధుల్లేక భూసేకరణలో తప్పని జాప్యం

రైతులు నష్టపరిహారం పెంచాలని కోరుతూ ఆర్బిట్రేషన్‌కు అర్జీలు పెట్టుకున్నారు. ఆర్బిట్రేషన్‌లో కొందరు రైతులకు ఎకరాకు రూ.కోటి, మరికొందరికి రూ.50 లక్షల చొప్పున కూడా నష్ట పరిహారం ఖరారు చేసినట్టు అధికారవర్గాలు తెలిపాయి. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఆర్బిట్రేషన్‌లో నష్టపరిహారం ఖరారు చేసిన రైతులకు కూడా చెల్లింపులు జరగడం లేదు. ఈ పరిహారంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ), రాష్ట్ర ప్రభుత్వం చెరిసగం చెల్లించాల్సి ఉంటుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో ట్రిపుల్ ఆర్‌కు రూ.1,250 కోట్లను ప్రతిపాదించినప్పటికీ ఇంతవరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. మరోవైపు, నష్ట పరిహారం కోసం రైతులు అటు ఆర్బిట్రేషన్ చుట్టూ తిరుగుతున్నారు. ముఖ్యంగా సంగారెడ్డిలోని కొన్ని ప్రాంతాలతోపాటు రాయగిరి, యాదాద్రి, సిద్దిపేట తదితర ప్రాంతాలకు చెందిన రైతులు నష్టపరిహారం పెంచాలని, అవార్డ్ పాస్ చేసిన విధంగా వెంటనే చెల్లింపులు చేపట్టాలని కోరుతున్నారు.

### ఉత్తర భాగం భూసేకరణ కొలిక్కొచ్చాకే..

ఈ నేపథ్యంలో తాజాగా రాష్ట్ర క్యాబినెట్ ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం రహదారికి ప్రతిపాదిత అలైన్‌మెంటుకు ఆమోదం తెలిపింది. దీనిప్రకారం దక్షిణ భాగం రహదారిని చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు సుమారు 201 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ఎక్కువగా ప్రభుత్వ భూములే ప్రభావితం అమవుతున్నట్టు, రైతులకు పెద్దగా నష్టం జరగని విధంగా అలైన్‌మెంటును రూపొందించినట్టు అధికారులు చెప్తున్నారు. కేంద్ర ప్రభుత్వం దీనికి ఆమోదం తెలిపాక భూసేకరణ ప్రక్రియ, ఆ తర్వాత టెండర్ల ప్రక్రియ మొదలవుతుంది. ఉత్తర భాగంలో నష్టపోతున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తమ వాటాగా చెల్లించాల్సిన పరిహారాన్ని విడుదల చేసి పనులు ప్రారంభమయ్యేందుకు చర్యలు తీసుకుంటే, దక్షిణ భాగం పనులు త్వరితగతిన ముందుకు సాగుతాయని అంటున్నారు.



నిజామాబాద్‌లో యాదవ మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాజారాం

## యాదవులను అణచివేస్తున్న కాంగ్రెస్ సర్కార్

- 30న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా
- యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్

ఖలీల్‌వాడి, జూన్ 24: కాంగ్రెస్ పార్టీ యాదవ కులస్థులను అణచి వేస్తున్నదని యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ విమర్శించారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల 30న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద మహ ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ మేరకు మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మహాధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి యాదవులు, మున్నూరుకాపులు, ఇతర కులాలను అణచివేస్తున్నట్టు మండిపడ్డారు. అత్యధిక జనాభా ఉన్న యాదవులను రేవంత్‌రెడ్డి కించపరుస్తూ మంత్రివర్గంలో స్థానం కల్పించకపోవటం, కనీసం ఎమ్మెల్సీ, నామినేటెడ్ పోస్టుల్లోనూ అవకాశం కల్పించకపోవడం దారుణమని అన్నారు. బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదని హెచ్చరించారు. యాదవులను అవమానపరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి సరైన బుద్ధిచెప్పాలని రాజారాం యాదవ్ పిలుపునిచ్చారు. ఈ నెల 30న నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# పింఛను వాటాలో వంచన!

మొదటిపేజీ తరువాయి...

తీవ్రంగా నష్టపోతున్నారు. . రాష్ట్రంలో 2004 తర్వాత నియమితులైన ఉద్యోగులంతా సీపీఎస్ పరిధిలోకి వస్తారు. వీరి మొత్తం వేతనంతోపాటు డీఏ నుంచి 10 శాతం ఉద్యోగి వాటాగా, మరో 10 శాతం ప్రభుత్వవాటాగా ప్రాన్ అకౌంట్‌లో జమచేస్తారు. దీనిపై వడ్డీ వస్తుంది. షేర్‌మార్కెట్‌లో పెట్టుబడి పెడితే వచ్చే లాభాలు వీటికి అదనం. రాష్ట్రంలో ప్రస్తుతం 2.2 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులు ఉన్నారు. వీరు సీపీఎస్ పరిధిలోకే వస్తారని చెప్తున్నారు. వీరి వేతనం నుంచి ఉద్యోగి వాటాగా నెలకు రూ. 100 కోట్లు, ప్రభుత్వ వాటాగా రూ.100 కోట్లు మొత్తంగా రూ. 200 కోట్లు ప్రాన్ అకౌంట్లకు జమచేయాల్సి ఉన్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక, 13 నెలలుగా అకౌంట్లలో జమ కాలేదు. అంటే రూ.2,600 కోట్లను ప్రభుత్వం సొంతానికి వాడుకున్నదన్నమాట. వీటికి వడ్డీ కూడా లెక్కిస్తే అదనంగా మరో రూ. 260 కోట్లు కలుస్తుందని పేర్కొన్నారు.

### రూ. 260 కోట్ల వడ్డీ లాస్

కాంగ్రెస్ ప్రభుత్వ చర్యల ఫలితంగా సీపీఎస్ ఉద్యోగులు తమ వాటాతోపాటు, ఆ వాటాపై వచ్చే వడ్డీని కూడా నష్టపోయారు. ప్రాన్ అకౌంట్లోని మొత్తంపై సగటున 9-10 శాతం వడ్డీ వస్తుంది. ప్రభుత్వ ఉద్యోగులు ఈ 13 నెలల్లో కోల్పోయిన వడ్డీయే అక్షరాలా రూ. 260 కోట్లుగా అంచనా. ఉదాహరణకు.. ఓ టీచర్ జీతం నుంచి ఉద్యోగి వాటాగా రూ.12 వేలు, ఎంప్లాయర్ (ప్రభుత్వ వాటా)గా రూ.12 వేలు మొత్తం రూ.24 వేలు ప్రతి నెల ఉద్యోగి ప్రాన్ అకౌంట్‌లో జమకావాలి. కానీ, జమ కావడంలేదు. అంటే.. రూ.24 వేలపై నెలకు 10 శాతం వడ్డీ అంటే నెలకు రూ.2,400 వడ్డీని ఆ ఉద్యోగి కోల్పోతున్నారన్నమాట. ఇలాగే రాష్ట్రంలోని 2.2 లక్షల మంది అసలుతోపాటు వడ్డీని కూడా నష్టపోతున్నారు.

### షేర్ మార్కెట్ ఆదాయం గోవిందా

సీపీఎస్ విధానంలో ఉద్యోగి, ప్రభుత్వ వాటా రెండింటిని ప్రాన్ అకౌంట్లల్లో జమచేసి, 9-10శాతం వడ్డీతో సహా అంతా ప్రతి నెలా షేర్‌మార్కెట్లో పెట్టుబడులు పెడతారు. ఎస్‌బీఐ, ఎల్‌ఐసీ, ఐసీఐసీఐ యూటీఐ పెన్షన్‌ఫండ్ మేనేజర్లు పెన్షన్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెడతారు. ఈ షేర్లు కొనడంతో లాభాలు వస్తే ఆయా లాభం ఉద్యోగుల ఖాతాలోకి వస్తుంది. 13 నెలలుగా ఉద్యోగి వాటా, సర్కారు వాటా చెల్లించకపోవడంతో షేర్ మార్కెట్లో పెట్టుబడి పెట్టడం ద్వారా లభించే ఆదాయాన్ని కూడా ఉద్యోగులు కోల్పోతున్నారు. ఉద్యోగి రిటైర్డ్ అయితే, ఆయా ఉద్యోగికి సంబంధించి ప్రాన్ అకౌంట్లో ఎంత వరకు జమచేశారో అంతే మొత్తాన్నే తీసుకుని మొత్తం పెన్షన్‌ను నిర్ధారిస్తారు. వాటాను జమచేయకపోవడంతో పెన్షన్ మొత్తం తగ్గే ప్రమాదం పొంచి ఉన్నది. ఇక ఉద్యోగి రిటైర్డ్ అయితే జమ అయిన మొత్తం నుంచి 60 శాతం నగదుగా ఇస్తారు. 40 శాతాన్ని మళ్లీ షేర్ మార్కెట్లో పెడతారు. దీని నుంచే పెన్షన్ అందుతుంది. దీంతో ఉద్యోగికి అందే మొత్తం నగదు, పెన్షన్ మొత్తం తగ్గే ప్రమాదం పొంచి ఉంది.

### భవిష్యత్తులోనూ కష్టమే

సీపీఎస్ ఉద్యోగుల సొమ్ము వాటాను ప్రభుత్వం జమ చేయడం కష్టంగానే కనిపిస్తున్నది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ఆర్థిక ప్రయోజనాలు అడగవద్దని బహిరంగంగానే ప్రకటించారు. తనను కోసుకుతిన్నా రూపాయి లేదని కుండబద్దలు కొట్టారు. ఈ 13 నెలల సొమ్మును భవిష్యత్‌లోనూ వాటా సొమ్ము జమ చేస్తారా? అంటే అనుమానంగా కనిపిస్తున్నది. ఇదే జరిగితే ఉద్యోగులు నెలకు రూ. 2600 కోట్లు, వడ్డీ, షేర్ మార్కెట్ లాభాలను నష్టపోవాల్సిందే. గతంలో పాత పెన్షన్ విధానంలో ఉద్యోగి పదవీ విరమణ పొందే సమయంలో డ్రా చేసిన జీతంలో సగం పెన్షన్‌గా అందేది. కానిప్పుడు నెలకు రూ.1500-2000 పెన్షన్‌గా అందనున్నది. ఉద్యోగి, సర్కారు వాటా వాటాను జమచేయకపోతే ఇక అది కూడా అందని ద్రాక్షేకానున్నది. రిటైర్డ్ ఉద్యోగుల పరిస్థితి మరీ దారుణం.. ఉద్యోగి నుంచి వసూలు చేసిన కంట్రిబ్యూషన్‌ను అతడి ప్రాన్ అకౌంట్‌లో మొత్తం జమయ్యే వరకు వేచి చూడాల్సి వస్తున్నది. ఎప్పుడైనా ఆపదకో, సంపదకో విత్‌డ్రా చేసుకుందామంటే కూడా ఆ అవకాశం లేదు. పెండింగ్‌లోని మొత్తం ప్రాన్ అకౌంట్‌లో జమ అయితేనే విత్‌డ్రా చేసుకోవచ్చు. మొత్తం జమ అయితేనే పెన్షన్ ప్లాన్‌ను పర్చేజ్ చేసుకునే చాన్స్‌కోల్పోయినట్లే.

### పాత పింఛన్ జాడే లేదు

కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు పాత పింఛన్‌ను అమలుచేస్తామని హామీనిచ్చింది. ఏకంగా మ్యానిఫెస్టోలో పొందుపరిచింది. అధికారంలోకి వచ్చి 17 నెలలు గడిచినా కనీసం సీపీఎస్ రద్దు మాటే ఎత్తడం లేదు. ఇదిలా ఉంటే 2003 డీఎస్సీ టీచర్ల పాలిట సీపీఎస్ శాపమైంది. డీఎస్సీ నోటిఫికేషన్ 2003లో ఇచ్చినా, ఉద్యోగాలను 2004లో భర్తీచేశారు. వాస్తవానికి నోటిఫికేషన్‌ను ప్రామాణికంగా తీసుకుని సీపీఎస్‌ను అమలుచేయాల్సి ఉండగా, కానీ పోస్టింగ్ తేదీ ఆధారంగా సీపీఎస్‌ను అమలుచేయడంలో ఆయా టీచర్ల పాలిట శాపంగా మారింది. దీంతో వీరంతా బలవంతంగా సీపీఎస్ పరిధిలోకి వచ్చారు. ఈ ఘోర పాపానికి కాంగ్రెస్‌పార్టీయే కారణం.

### ఏరియర్స్ ఇన్‌స్టాల్‌మెంట్‌లోనా..

ఉద్యోగుల డీఏ ఏరియర్స్ కూడా జనవరి నుంచి పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇవి కూడా ప్రాన్ అకౌంట్‌లో జమకావడంలేదు. గతంలో ఇచ్చిన ఒక డీఏ ఏరియర్స్ 17 నెలల ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో ఐదు మాత్రమే పూర్తయ్యాయి. 12 నెలలవి పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల ప్రకటించిన డీఏ ఏరియర్స్‌ను 28 సమాన వాయిదాల్లో చెల్లిస్తామన్నారు. అదే జీపీఎఫ్ వారికి డీఏ బకాయిలు మొత్తం ఒకే సారి జీపీఎఫ్‌కు జమచేస్తున్నారు. ఏరియర్స్ కూడా ఇన్‌స్టాల్‌మెంట్‌లోనా అంటూ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. మరో వారం రోజుల్లో జూలై 1న మరో డీఏ పెండింగ్‌లో పడుతుంది. దీంతో పెండింగ్ డీఏలు ఐదుకు చేరుతాయి. అటూ డీఏలు, ఇటూ ఏరియర్స్ రెండు బకాయిలు పడటం ఉద్యోగులు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### పాత పింఛన్‌ను అమలు చేయండి

ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలి. ఈ విధానం రద్దు చేసే వరకు నిర్దేశిత సమయంలో ఉద్యోగి వాటా, రాష్ట్రవాటాను జాప్యం చేయకుండా ప్రాన్ అకౌంట్లల్లో జమచేయాలి. ప్రాన్ అకౌంట్లల్లో జమ చేయకపోవడంతో ఉద్యోగులంతా నష్టపోతున్నారు. డీఏ ఏరియర్స్‌ను ఇన్‌స్టాల్‌మెంట్లల్లో చెల్లించడం వల్ల కూడా నష్టం జరుగుతున్నది. డీఏ బకాయిలను కూడా జీపీఎఫ్ తరహాలో ఒకేసారి చెల్లించాలి.

**- నరేందర్‌రావు, టీఎస్ సీపీఎస్ఈయూ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు**

### 13 నెలలుగా జమ చేయకపోవడం దారుణం

సీపీఎస్‌ను రద్దు చేస్తామని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కానీ ఈ హామీని విస్మరించింది. పైగా 13 నెలలుగా ఉద్యోగులు, ప్రభుత్వ వాటాను ప్రాన్ అకౌంట్లో జమ చేయకపోవడం అత్యంత దారుణం. డీఏ ఎరియర్స్‌ను ఇన్‌స్టాల్‌మెంట్లల్లో ఇవ్వడంతో మేం నష్టపోతున్నాం. ఒక సీపీఎస్ ఉద్యోగి నెలకు మూడు బిల్లులు చేయాల్సి వస్తున్నది. సీపీఎస్ విధానం ఉద్యోగులకు శాపంగా మారింది. దీని నుంచి విముక్తి కల్పించాలి.

**- హన్మాండ్ల భాస్కర్, టీసీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**

## కోడలి వేధింపులు భరించలేక అత్త ఆత్మహత్య

మరికల్, జూన్ 24 : కోడలి వేధింపులు భరించలేక అత్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం నారాయణపేట జిల్లాలో చోటుచేసుకున్నది. ఎస్సై రాము కథనం మేరకు.. మరికల్ మండలం గాజులయ్య తండాకు చెందిన సకీరమ్మ(70)కు ఇద్దరు కుమారులు. చిన్నకొడుకు గేనునాయక్, కోడలు జయమ్మ, మనుమడు జైపాల్ తరచూ సకీరమ్మతో గొడవపడేవారు. వారి వేధింపులు భరించలేక మంగళవారం ఉరేసుకొని మృతి చెందింది. పెద్దకుమారుడు రాంసింగ్‌నాయక్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

## తేజేశ్వర్ కేసులో రోజుకో మలుపు!

- అడ్డంగా పోలీసులకు చిక్కిన ఐశ్వర్య, తిరుమల్‌రావు

గద్వాల, జూన్ 24 : గద్వాలకు చెందిన ప్రైవేటు సర్వేయర్ తేజేశ్వర్ హత్య ఘటన రోజుకో మలుపు తిరుగుతున్నది. తేజేశ్వర్‌ను అంతం చేశాక కశ్మీర్‌లోని లఢక్‌కు వెళ్లి ఎంజాయ్ చేయాలని ప్రైవేటు బ్యాంక్ మేనేజర్ తిరుమల్‌రావు, ఐశ్వర్య నిర్ణయించుకున్నారంట. తిరిగి వచ్చాక వివాహం చేసుకోవాలని ప్లాన్ చేసుకున్నట్టు తెలిసింది. లఢక్ వెళ్లడానికి బ్యాంక్‌లో తిరుమల్‌రావు రూ.20 లక్షల హోం లోన్ తీసుకున్నట్టు సమాచారం. తేజేశ్వర్ కనిపించడంలేదని అతడి తల్లిదండ్రులు గద్వాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుతో వారి ప్లాన్‌కు బ్రేక్ పడింది. పోలీసులు ఐశ్వర్యను విచారించగా అసలు విషయం బయటపడింది. తిరుమల్‌రావు, ఐశ్వర్య ఊచలు లెక్కపెడుతున్నారు.